సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

ఆదివారం । 3 । మార్చి । 2024



రూ.లక్ష విరాళం


ఆలమూరు: చింతలూరు వేంకటేశ్వరస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలకు కొత్తపేట ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి, లావణ్య దంపతులు శనివారం రూ.లక్ష విరాళం సమర్పించారు.



రూ.1.50 లక్షల విరాళం

నల్లజర్ల: చీపురుగూడెంలోని వినాయకస్వామి ఆలయ నిర్మాణానికి చెల్లు శ్రీరామ్మూర్తి, సూర్య కాంతమ్మల జ్ఞాపకార్థం వారి కుటుంబ సభ్యులు రూ.1.50 లక్షల విరాళం అందజేశారు.

డెల్టాలకు 8,970 క్యూసెక్కులు



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి గోదావరి డెల్టా కాలువలకు శనివారం 8,970 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు. ఇందులో తూర్పు డెల్టాకు 2,650, మధ్య డెల్టాకు 1,720, పశ్చిమ డెల్టాకు 4,600 క్యూసెక్కుల చొప్పున వదిలారు. బ్యారేజీ వద్ద నీటిమట్టం 9.75 అడుగులుగా నమోదైంది.

న్యూస్‌రీల్

సీనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

రాయవరం: ఇంటర్మీడియెట్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు శనివారం ప్రారంభమయ్యాయి. తెలుగు, సంస్కృతం పరీక్షలను విద్యార్థులను రాశారు. జిల్లా వ్యాప్తంగా 38 కేంద్రాల్లో 11,481 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కావాల్సి ఉండగా, 387 మంది గైర్హాజరైనట్టు డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు.

రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అంజిబాబు



అంజిబాబును సత్కరిస్తున్న మంత్రి విశ్వరూప్

అమలాపురం టౌన్: రాష్ట్ర బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా అమలాపురానికి చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా సేవాదళ్ అధ్యక్షుడు మంగళంపల్లి అంజిబాబు నియమితులయ్యారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. ఈ సందర్భంగా అంజిబాబును రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్, ఎంపీ చింతా అనురాధ తమ క్యాంపు కార్యాలయాల్లో శనివారం అభినందించి సత్కరించారు. అంజిబాబు వైఎస్సార్ సీపీ పార్టీ ఆవిర్భావం నుంచి పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడిగా, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సంఘం అధ్యక్షుడిగా పనిచేశారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడిగా, జిల్లా సంఘం అధ్యక్షుడిగా వ్యవహరిస్తున్నారు. కాగా.. పార్టీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు, పార్టీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు మట్టపర్తి నాగేంద్ర, పట్టణ పార్టీ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ నాయకుడు వంటెద్దు వెంకన్నాయుడు తదితరులు అంజిబాబుకు అభినందనలు తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



విప్పర్తి వేణుగోపాలరావును మర్యాద పూర్వకంగా కలిసిన వెంకట రామిరెడ్డి

అంబాజీపేట: నియోజకవర్గ పార్టీ ఇన్‌చార్జి, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాలరావును ఏపీ సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి శనివారం గంగలకుర్రు గ్రామంలో మర్యాద పూరకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను విప్పర్తి దుశ్శాలువాతో సత్కరించారు. నియోజకవర్గ పార్టీ పరిశీలకులు చెల్లుబోయిన శ్రీనివాసరావు, ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, ఏపీ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్‌కృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, నాయకులు నేలపూడి స్టాలిన్‌బాబు, దొమ్మేటి సత్యమోహన్, డి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రెండు చుక్కలు.. నిండు నూరేళ్లు

- నేడు పల్స్ పోలియో కార్యక్రమం
- ఏర్పాట్లు పూర్తి చేసిన యంత్రాంగం



చిన్నారికి పోలియో చుక్కలు వేస్తున్న దృశ్యం (ఫైల్)

రాయవరం/కొత్తపేట: పిల్లల ఆరోగ్యం విషయంలో ముందు చూపు అవసరం. రెండే రెండు చుక్కలు వారిని పోలియో బారిన పడకుండా చేస్తాయి. నిండు నూరేళ్లూ ఆరోగ్యంగా ఉండేలా చూస్తాయి. తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధతో తమ పిల్లలకు సకాలంలో వ్యాక్సిన్లు వేయించాలి. జబ్బు వచ్చాక చికిత్స పొందడం కన్నా జబ్బు రాకుండా చూసేలా ముందస్తుగా వ్యాక్సిన్లు ఇప్పించడం ఎంతో మేలు. ఈ నేపథ్యంలో ఆదివారం పల్స్ పోలియో వ్యాక్సినేషన్ ప్రారంభమవుతుంది. ఈ మేరకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది.

వ్యాక్సిన్‌తోనే జీవితం ప్రారంభం

పిల్లలకు పుట్టిన వెంటనే ఓరల్ పోలియో వ్యాక్సిన్‌ను (ఓపీవీ) జీరో డోస్ ఇస్తారు. చిన్నారులకు అంగ వైకల్యం రాకుండా ఉండేందుకు దీన్ని వేస్తారు. అలాగే పిల్లలు పుట్టిన 24 గంటల లోపు హెపటైటిస్–బి జీరో డోస్, బీసీజీ, ఆ తర్వాత ఆరు, పది, 14 వారాలకు, ఆ తర్వాత వివిధ రకాల వ్యాక్సిన్లు వేస్తారు. ఇవన్నీ వారికి ప్రమాదకరమైన జబ్బుల నుంచి రక్షణ కల్పిస్తాయి.

జిల్లాలో 1.45 లక్షల మంది చిన్నారులు

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ఐదేళ్ల లోపు ఉన్న 1,45,318 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకోసం 983 పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేశారు. పల్స్ పోలియోను పకడ్బందీగా నిర్వహించేందుకు 27 ట్రాన్సిట్, 52 మొబైల్ టీములను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో ప్రజలు ఉండే ప్రదేశాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు తదితర చోట్లకు ట్రాన్సిట్ టీమ్‌లు వెళ్లి, అక్కడ ఉంటే చిన్నారులకు వాక్సిన్ వేస్తాయి. జిల్లాలో గుర్తించిన 458 హైరిస్క్ ప్రాంతాలకు మొబైల్ టీములు వెళతాయి.

హైరిస్క్ ప్రాంతాల్లో 3,939 చిన్నారులు ఉన్నట్లు గుర్తించారు. 343 ఇటుక బట్టీలు, సంచార జాతులు, తదితర ప్రదేశాలకు మొబైల్ టీములు వెళ్లి అక్కడ ఉన్న చిన్నారులకు వాక్సినేషన్ చేస్తాయి. ఆదివారం వ్యాక్సినేషన్‌తో పాటు సోమ, మంగళవారాల్లో మాపింగ్ ప్రోగ్రామ్‌లో భాగంగా హైరిస్క్ ప్రాంతాలను మొబైల్ టీమ్‌లు కవర్ చేస్తాయి. ఈ పల్స్ పోలియో కార్యక్రమంలో 103 మంది వైద్యాధికారులు, 193 మంది సూపర్ వైజర్లు, 3,932 మంది ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, మిడ్ లెవల్ హెల్త్ ప్రొవైడర్లు పాల్గొంటున్నారు.

సోమ, మంగళవారాల్లో మ్యాపింగ్ అప్ ప్రోగ్రామ్

జిల్లా వ్యాప్తంగా ఆదివారం పల్స్ పోలియో కార్యక్రమం జరుగుతుంది. దాదాపు 95 శాతం వరకూ చిన్నారులకు వ్యాక్సిన్లు వేస్తారు. వివిధ కారణాలతో పోలియో చుక్కలు వేయించుకోలేని అన్‌ప్రొటెక్టెడ్ చిన్నారులకు సోమ, మంగళవారాల్లో మ్యాపింగ్ అప్ ప్రోగ్రామ్ చేస్తారు. ఈ ప్రోగ్రామ్‌లో భాగంగా 1,850 టీములు ఇంటింటికీ వెళ్లి అన్‌ప్రొటెక్టెడ్ చిన్నారులకు గుర్తించి, వారికి పోలియో చుక్కలు వేస్తాయి. ఈ విధంగా 3,79,339 కుటుంబాల వద్దకు వెళ్లి మాపింగ్ అప్ కార్యక్రమం చేపడతారు.



తప్పకుండా వేయించాలి



పల్స్ పోలియో కార్యక్రమంలో భాగంగా అప్పుడే పుట్టిన శిశువు నుంచి ఐదేళ్ల లోపు చిన్నారులందరికీ పోలియో చుక్కలు వేయాలని లక్ష్యంగా నిర్ణయించాం. ముందు రోజు పోలియో చుక్కలు వేసినప్పటికీ ఆదివారం అదనపు పోలియో చుక్కలు వేయించాలి. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. పోలియో మహమ్మారిని తరిమికొట్టాలంటే అందరి సహకారం అవసరం.

– డాక్టర్ టీవీవీ సత్యనారాయణ, జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి, వైద్య, ఆరోగ్య శాఖ, అమలాపురం

విస్తృత ప్రచారం



పల్స్ పోలియోను విజయవంతం చేసేందుకు విస్తృతంగా ప్రచారం చేశాం. ఆ మేరకు జిల్లాలోని పీహెచ్‌సీలు, సీహెచ్‌సీలు, ఏరియా ఆస్పత్రులకు సూచనలిచ్చాం. ముందురోజు ర్యాలీలు, అవగాహనా కార్యక్రమాలను నిర్వహించే విధంగా ఆదేశాలు జారీ చేశాం. జిల్లా వ్యాప్తంగా శతశాతం లక్ష్యాన్ని పూర్తి చేసేలా చర్యలు చేపడుతున్నాం. సమాజంలో ప్రతి ఒక్కరి సహకారంతో విజయవంతం చేస్తాం.

– డాక్టర్ దుర్గారావుదొర, జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి, అమలాపురం

మహాసేన రాజేష్‌కు టీడీపీ టిక్కెట్ ఇవ్వొద్దు

- టీడీపీ, జనసేన కార్యకర్తల ఉమ్మడి సమావేశం డిమాండ్
- రాజేష్ గో బ్యాక్ అని నినాదాలు



రాజేష్ గోబ్యాక్ అంటూ ప్లకార్డులు ప్రదర్శిస్తున్న టీడీపీ, జనసేన కార్యకర్తలు

పి.గన్నవరం: పి.గన్నవరం టీడీపీ టిక్కెట్‌ను మహాసేన రాజేష్‌కు ఇవ్వొద్దని మండల టీడీపీ, జనసేన పార్టీల ఉమ్మడి కార్యకర్తల సమావేశం ఆయా పార్టీల అధిష్టానాలను డిమాండ్ చేసింది. ఎల్.గన్నవరంలో రాష్ట్ర టీడీపీ కార్య నిర్వాహక కార్యదర్శి డొక్కా నాథ్‌బాబు నివాసం వద్ద టీడీపీ, జనసేన మండల శాఖ అధ్యక్షులు తోలేటి సత్తిబాబు, సాధనాల శ్రీవెంకట సత్యనారాయణ అధ్యక్షతన శనివారం ఉమ్మడి కార్యకర్తల సమావేశం జరిగింది. రాజేష్ కాకుండా ఇతరులు ఎవ్వరికి టిక్కెట్ ఇచ్చినా తమకు అభ్యంతరం లేదని సమావేశం వెల్లడించింది. వివాదాస్పదమైన వ్యక్తి రాజేష్‌ను అన్ని వర్గాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారని పలువురు నాయకులు వివరించారు. రాజేష్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించిన నాటి నుంచీ నియోజకవర్గంలో గందర గోళ పరిస్థితులు నెలకొన్నాయని, దీనిని అధిష్టానం గుర్తించాలని కోరారు. రాజేష్ గోబ్యాక్ అంటూ నినాదాలు చేసి, ప్లకార్డులు ప్రదర్శించారు. ఎంపీపీ గనిశెట్టి నాగలక్ష్మి, నాయకులు సంసాని పెద్దిరాజు, వాసంశెట్టి కుమార్, సర్పంచ్‌లు బొండాడ నాగమణి, యల్లమెల్లి కృష్ణవేణి, పసలపూడి రామకృష్ణ, ఎంపీటీసీలు ఆదిమూలం సూరయ్యకాపు, చెల్లుబోయిన గంగాదేవి, పులపర్తి చిన వెంకటలక్ష్మి, పాలూరి వీరభద్రం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

అమలాపురం రూరల్: ప్రభుత్వ, ఉపాధ్యాయ, కార్మిక, కాంట్రాక్ట్ అవుట్ సోర్సింగ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని, వాటిని ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లామని ఏపీ గవర్నమెంట్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ చైర్మన్ కాకర్ల వెంకట రామిరెడ్డి అన్నారు. అమలాపురం మండల ప్రజా పరిషత్ మీటింగ్ హాల్‌లో ఏపీజీఈఎల్ఎఫ్ అనుబంధ గ్రామ, వార్డు సచివాలయ అసోసియేషన్ శనివారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనానికి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ కోనసీమ జిల్లా గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగ సంఘం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. అధ్యక్షుడిగా కిరణ్ జగడం, ప్రధాన కార్యదర్శిగా మట్టపర్తి సముద్రం, వర్కింగ్ అధ్యక్షులుగా కె.సురేష్, స్వామి, కృష్ణ కుమారి, ఉపాధ్యక్షులుగా ఎస్.రాజకుమారి, ఎం.నూకలరావు ప్రసాద్, లక్ష్మి, చెల్లి నాగేంద్ర కుమార్, సంయుక్త కార్యదర్శులుగా సాయిరాం, రవి వర్మ, నరసింహారావు, ఎంఎం నూకలరావు, కోశాధికారిగా ఎస్.హరిబాబు, వై.ప్రసాద్, మరో 9 మంది ఏసీ మెంబర్లుగా ఎన్నికయ్యారు. వీరిని స్టేట్ వైస్ చైర్మన్ విప్పర్తి నిఖిల్ కృష్ణ, సంఘం నాయకులు షేక్ మహబూబ్ బాషా, జాన్ క్రిస్టోఫర్, ఈశ్వర్ రాయుడు, రాష్ట్ర రెవెన్యూ జేఏసీ చైర్మన్ వీఎస్ దివాకర్ తదితరులు అభినందించారు.

పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలి

- కలెక్టర్ హిమాన్షు శుక్లా
- అధికారులతో సమీక్ష



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: ఐదేళ్ల లోపు పిల్లలందరికీ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాలని కలెక్టర్ హిమాన్షు శుక్లా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అమరావతి సచివాలయం నుంచి రాష్ట్ర ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి శనివారం ఉదయం వివిధ జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రెవెన్యూ అంశాలు, రీ సర్వే ఫేజ్ 3, నవరత్నాలు పేదలందరికీ ఇళ్ల నిర్మాణాలు, వాటి రిజిస్ట్రేషన్, కరువు మండలాలలో ఉపాధి హామీ పథకం కింద ఉపాధి కల్పన, తాగునీటి సమస్యలు, ఇండస్ట్రీలకు భూ కేటాయింపులు, ఎంఎస్ఎమ్ఈల కస్టర్ల ఏర్పాటు, పప్పు దినుసులు నూనె గింజల సేకరణ, జగనన్న ఆరోగ్య సురక్ష, పోలియో టీకాల తదితర అంశాలపై సమీక్షించారు. కలెక్టరేట్ నుంచి కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ నూపుర్ అజయ్, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జిల్లా అంతటా పోలియో బూత్‌లు

వీడియో కాన్ఫరెన్స్ అనంతరం అధికారులతో కలెక్టర్ మాట్లాడుతూ ఆదివారం జరిగే పోలియో వాక్సినేషన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. జిల్లా అంతటా పోలియో బూత్‌లు నిర్వహించి, పిల్లలందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు. జిల్లాలో దాళ్వా సాగులో భాగంగా డ్రైన్లలో వృథాగా పోయే నీటిని అరికట్టి, శివారు పంటచేలకు అందించడానికి డ్రైన్లపై క్రాస్ బండ్ల నిర్మాణం, ఇంజిన్ల ఏర్పాట్లకు ప్రభుత్వానికి నివేదించమన్నారు. వేసవిలో తాగునీటి ఎద్దడి ఉన్న ప్రాంతాలలో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించేలా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. ఈ నెల 6వ తేదీ ఉదయం 7 గంటల నుంచి జిల్లాలోని అన్ని ఓవర్ హెడ్ ట్యాంకులను ఒకేసారి శుభ్రపరిచే కార్యక్రమం జరుగుతుందని, దానికి తగిన కార్యాచరణ రూపొందించాలన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ నుపూర్ అజయ్, డీఆర్ఓ ఎం.వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ మధుసూదన్, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, పంచాయతీరాజ్ ఎస్ఈ చంటిబాబు, డీఎంహెచ్ఓ దుర్గారావు దొర, గ్రామీణ నీటిసరఫరా శాఖ ఎస్ఈ కృష్ణారెడ్డి, సీపీఓ వెంకటేశ్వర్లు, గ్రామ, వార్డు సచివాలయ నోడల్ అధికారి భీమేశ్వరరావు పాల్గొన్నారు.

పల్లె వాకిట తెలుగు దీపం.. ఆంధ్రీ కుటీరం

- నేడు మధునాపంతుల 104వ జయంతి
- పలువురు కవులకు సత్కారం

కాజులూరు: ఆధునిక కాలంలో సాహిత్యం, కళలకు రోజురోజుకీ ప్రజాదరణ తగ్గిపోతోంది. అయితే తెలుగు జాతి మనుగడకు సాహిత్యమే మూలాధారమని నమ్మి ఎందరో కవులు, రచయితలు నేటికీ సాహిత్య సేవ చేస్తున్నారు. అటువంటి వారిలో కాజులూరు మండలం పల్లిపాలేనికి చెందిన మధునాపంతుల కుటుంబీకులు ప్రముఖులు. సుమారు ఎనిమిది దశాబ్దాల క్రితం గ్రామంలో ఆంధ్రీ కుటీరం పేరుతో ఒక సంస్థను స్థాపించి హరిజనులకు సైతం ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సంస్కృత భాషలలో విద్యా బోధన చేశారు. నేటికీ గ్రామంలోని పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయిలో ఉచిత విద్యనందిస్తూ చదివిస్తున్నారు. సమాజానికి తమ వంతు భాషా సేవ చేయాలనే లక్ష్యంతో 1939లో ఆంధ్రీ పేరుతో ఒక సాహిత్య మాసపత్రికను స్థాపించి, దాని ద్వారా పలువురు కవుల భాషా, సాహిత్యాలను వెలుగులోకి తీసుకువచ్చి, నేటికి ఎందరో కవులు, రచయితలకు సన్మానాలు, సత్కారాలు చేస్తూ వారిని ప్రోత్సహిస్తున్నారు.

ఆంధ్రీ కుటీరానికి మూలపురుషుడు సత్యనారాయణశాస్త్రి

గోదావరి తీరం యానాం సమీపాన చిన్న గ్రామం పల్లిపాలెం. కనీస వసతులు లేని ఆ గ్రామంలో 1938 జనవరి 13న ఆంధ్రీ కుటీరం అనే సంస్థను స్థాపించి ఆంధ్రపురాణాది కావ్యాలను విరచించిన కళాప్రపూర్ణుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి. తాను నేర్చిన సాహిత్య జ్ఞాన సంపదను గ్రామ సీమల్లోని జిజ్ఞాసువులకు పంచాలనే ఏకైక లక్ష్యంతో హరిజనులకు సైతం ప్రాచీన కావ్య సంపద, తెలుగు, సాంస్కృతిక భాషలను బోధించాలనే అభ్యుదయ భావాలతో వారికి భోజన, వసతి సదుపాయాలు కల్పించి తమ కుటీరంలో చదువు నేర్పారు. అనంతరం కాలంలో వారిలో చాలా మంది ఉపాధ్యాయులుగానూ, పలు రకాల ఉద్యోగాల్లోనూ స్థిరపడి మంచి పేరు గడించుకున్నారు. ఆంధ్రీ కుటీరం 1980 దశకంలో కొత్త కొమ్మలు, రెమ్మలతో విరబూసింది. నవతరం నిర్వహణలోకి వచ్చింది. అటు సంప్రదాయ పథం–ఇటు నవీన పంథా ఆంధ్రీకి నవ్యోత్సాహాన్ని ఇచ్చాయి. మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి కుమారులు సూరయ్య శాస్త్రి పర్యవేక్షణలో వారి తనయుడు సత్యనారాయణమూర్తి నిర్వహణ బాధ్యతలు స్వీకరించారు. కోలంక జిల్లా పరిషత్ పాఠశాలలో తెలుగు పండిట్‌గా పనిచేస్తూ, అనువంశిక ఆయుర్వేద వైద్యం నిర్వహిస్తూ కుటీరాన్ని, సాహిత్యాన్ని కొనసాగిస్తున్నారు. 2011లో 'మధుశ్రీలు' పుస్తకావిష్కరణ సందర్భంగా పల్లిపాలెం అద్దేపల్లి రామమోహనరావు అధ్యక్షతన జరిగిన కవి సమ్మేళనానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రసిద్ధ కవులందరూ హాజరయ్యారు. ఆంధ్రీ కుటీరంలో నేటికీ ఏటా మధునాపంతుల జయంతి సభలు నిర్వహిస్తోంది. ఆంధ్రీ కుటీరం, ఆంధ్రీ పత్రిక వ్యవస్థాపకుడు మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి 104వ జయంతి మహోత్సవాలు ఆదివారం పల్లిపాలెంలో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ప్రముఖ కవి, సీనియర్ జర్నలిస్ట్ చింతకింది శ్రీనివాసరావు, ఎండపల్లి భారతి, భగవతం తదితరులకు గౌరవ పురస్కారం, నగదు బహుమతులు అందజేయనున్నారు.



పల్లిపాలెంలోని ఆంధ్రీ కుటీరం. (అంతరచిత్రం) మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి

క్లుప్తంగా

విఘ్నేశ్వరునికి బంగారు పళ్లెం, వెండి బిందె సమర్పణ



బంగారు పళ్లెం, వెండి బిందె అందజేస్తున్న సత్యనారాయణ దంపతులు

అయినవిల్లి: మండల కేంద్రం అయినవిల్లిలో కొలువైన విఘ్నేశ్వరస్వామికి ఇదే మండలం వీరవల్లిపాలెం గ్రామానికి చెందిన సుతాపల్లి సత్యనారాయణ, బాలసత్య దుర్గాకుమారి దంపతులు శనివారం రూ.5,10,000 విలువైన 81.600 గ్రాముల బంగారు పళ్లెం, రూ.80 వేలు విలువ చేసే 1,003 గ్రాముల వెండి బిందె సమర్పించారు. స్వామివారి అన్న ప్రసాద ట్రస్ట్‌కు రూ.20 వేల విరాళం అందజేశారు. ఈ వస్తువులను, సొమ్మును ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబుకు అందించారు.

మత్స్యకారుడి మృతి

ఉప్పలగుప్తం: అల్లవరం మండలం నక్కా రామేశ్వరానికి చెందిన ఆరుగురు మత్స్యకారులు శనివారం ఉదయం పంతాడి పెంటయ్యకు చెందిన ఫైబర్ ఇంజిన్‌లో బోటులో సముద్రంలో చేపల వేటకు వెళ్లారు. చల్లపల్లి పంచాయతీ పరిధి వాసాలతిప్ప తీరంలో వేటాడుతుండగా సముద్రపు అలలకు బోటు తిరగబడింది. దీంతో కొపనాతి కోదండం (40) నీటిలో మునిగి మృతి చెందగా, మిగిలిన ఐదుగురూ ఒడ్డుకు చేరుకున్నారు. మృతుడి సోదరుడు శివయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై కె.మనోహర జోషి కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని అమలాపురం ఏరియా ఆసుపత్రికి తరలించారు.

పెళ్లికి వెళ్లి వచ్చేసరికీ ఇంటిలో చోరీ

రాజోలు: పెళ్లికి వెళ్లి వచ్చేసరికీ ఇంట్లో దొంగలు పడి రూ.20 లక్షల విలువైన బంగారు, వెండ వస్తువులను చోరీ చేశారు. శివకోడు గ్రామానికి చెందిన గాదె వెంకట సూర్యరామ మురళీకృష్ణ గత నెల 28న ఇంటికి తాళం వేసి పెళ్లికి వెళ్లారు. తిరిగి ఈనెల ఒకటో తేదీ రాత్రి ఇంటికి వచ్చారు. ఇంటికి రాగానే తలుపులు తెరిచి ఉండటాన్ని గమనించి, లోపలకు వెళ్లి చూడగా ఇంట్లో బీరువాలో దాచిన సుమారు రూ.20 లక్షల విలువైన వెండి, బంగారు వస్తువులు చోరీకి గురైనట్టు గుర్తించారు. ఈ మేరకు శనివారం రాజోలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదే తరహాలో రాజోలులోని ఎల్‌బీ నగర్‌లో నివాసం ఉంటున్న డిగ్రీ కళాశాల వ్యాయామ ఉపాధ్యాయుడు బొంతు మధుకుమార్ ఇంటిని తలుపులు దొంగలు గునపాలతో బద్దలు కొట్టి బీరువాలోని సుమారు రూ.5 లక్షల విలువ చేసే బంగారు వస్తువులను మూడు రోజుల క్రితం దొంగిలించారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన రాజోలు ఎస్సై పృథ్వీ సంఘటనా స్థలాలను పరిశీలించారు. డాగ్ స్క్వాడ్, క్లూస్ టీమ్‌లు ఆధారాలను సేకరించాయి.

బూడిద పూసిన బంగారం

- బూడిద గుమ్మడికి మంచి డిమాండ్
- పెట్టుబడి తక్కువ, లాభాలు ఎక్కువ
- జిల్లాలో పెరిగిన సాగు

పిఠాపురం: మన సంస్కృతిలో బూడిద గుమ్మడిది ప్రత్యేక స్థానం. శుభకార్యాలు, పూజలు, వంటలు, ఔషధాల తయారీలో దీన్ని విరివిగా ఉపయోగిస్తున్నారు. గతంలో దిష్టి తీయడానికి, వడియాలలో ఉపయోగించే బూడిద గుమ్మడికి కరోనా అనంతరం ప్రాధాన్యం పెరిగి బూడిద పూసిన బంగారంలా మారిపోయింది. ఒకప్పుడు చెత్త కుప్పలు, ముళ్ల కంచెలు, ఎక్కడ పడితే అక్కడ పండే ఈ పంటను ఇప్పుడు రైతులు తమ పొలాల్లో పండించి మంచి రాబడి సాధిస్తున్నారు. ఇతర పంటలతో పోలిస్తే గుమ్మడి సాగులో శ్రమ, ఖర్చు తక్కువ. పిఠాపురం నియోజకవర్గంతో పాటు జిల్లాలో వివిధ ప్రాంతాల్లో వందల ఎకరాల్లో అంతర పంటగా గుమ్మడి సాగు జరుగుతోంది.

బూడిద గుమ్మడి.. భలే రాబడి

ఎకరానికి రూ.15 వేల పెట్టుబడితో బూడిద గుమ్మడిని సాగు చేస్తే దాదాపు 15 టన్నుల వరకూ దిగుబడి వస్తుంది. ఒక్కో కాయ సుమారు 2 కేజీల నుంచి 10 కేజీల వరకూ బరువు తూగుతుంది. మార్కెట్‌లో టన్ను రూ.18 వేలు ధర పలుకుతోంది. కేవలం మూడు నెలల వ్యవధిలో పంట చేతికి వస్తుంది. ఇతర పంటలకు ఒక ఎకరానికి సరిపడే నీరు, బూడిద గుమ్మడికి నాలుగెకరాలకు సరి పోతుంది. చీడ పీడల బెడద ఉండక పోవడంతో ఎరువులు, పురుగు మందులు అవసరం లేదు. విత్తనం, ఎరువులు, కూలీల ఖర్చులతో సహా ఎకరానికి రూ.15 వేలు మాత్రమే పెట్టుబడి అవుతుంది. ఎకరానికి 15 టన్నుల వరకు దిగుబడి వచ్చి, రూ 1.50 లక్షల వరకు ఆదాయం సమకూరుతుంది. కాకినాడ జిల్లాలో పండిస్తున్న బూడిద గుమ్మడి కాయలను తమిళనాడు, కేరళ, బెంగాల్, ఒడిశా, కర్ణాటక, ఛత్తీస్‌గఢ్ తదితర రాష్ట్రాలకు ఎగుమతి చేయడం ద్వారా రైతులు మంచి ఆదాయం ఆర్జిస్తున్నారు.

దిష్టికే కాదు ఆరోగ్య పరిపుష్టికి కూడా..

ఏ ఇంటి ముందు చూసినా దిష్టి తగలకుండా బూడిద గుమ్మడి కాయను తగిలిస్తారు. ఇది ఆరోగ్య పరిపుష్టికి కూడా ఎంతో ఉపయోగపడుతుంది. వంద గ్రాముల బూడిద గుమ్మడి జ్యూస్‌లో కేవలం 10 కేలరీలు మాత్రమే ఉండడంతో దీన్ని జీఓ కేలరీల జ్యూస్‌గా చెబుతారు. కూరగాయలన్నింటిలో అతి తక్కువ కేలరీలు ఉన్నది ఇది ఒక్కటే. కానీ దీనిలో విటమిన్స్, మినరల్స్, లవణాలు చెప్పలేనన్ని ఉంటాయి. ప్రతి రోజూ ఒక గ్లాసు జ్యూస్ తీసుకుంటే శరీరంలో కేన్సర్ కణాల సంఖ్య గణనీయంగా తగ్గుతుందని, గుండె పనితీరు మెరుగు పడుతుందని పరిశోధనల్లో తేలింది. కోళ్ల ఫారాల్లో కోళ్లకు యాంటిబయోటిక్ మందుగా దీనిని ఉపయోగిస్తున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉన్న బూడిద గుమ్మడి కాయలు

ఆదాయం బాగుంది



ఎకరం పొలంలో పెద్ద పెండలం తోట వేసి, అంతర పంటగా బూడిద గుమ్మడిని సాగు చేస్తున్నాను. టన్ను కాయలు రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ పలుకుతున్నాయి. ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి పంటను కొనుగోలు చేస్తున్నారు. పెట్టుబడి తక్కువైనప్పటికీ ఆదాయం పదిరెట్లు ఎక్కువ ఉంటోంది. నాటు రకాలకే ఎక్కువ డిమాండ్ ఉంటోంది.

– కొండపల్లి వీరబాబు, విరవాడ, పిఠాపురం మండలం

రైతుల్లో పెరిగిన ఆసక్తి



పిఠాపురం నియోజకవర్గంలో ఈ పంటను సాగు చేసేందుకు రైతులు ముందుకు వస్తున్నారు. పెట్టుబడి తక్కువ, అంతర పంటగా సాగు చేసుకునే వీలు, ఆదాయం ఎక్కువగా ఉండడంతో రైతుల్లో ఆసక్తి పెరిగింది. గత రెండేళ్ల కంటే ఈ ఏడాది ఈ పంటను సాగు చేసే రైతులు పెరిగారు. ఉద్యానశాఖ ద్వారా వారికి సూచనలు, సలహా అందిస్తున్నాం. మార్కెటింగ్ సౌకర్యం పెరగడంతో ఆదాయం బాగుంటోంది.

– కేఎస్ శైలజ, ఉద్యానశాఖాధికారి, పిఠాపురం

గోవింద నామస్మరణతో మార్మోగిన వాడపల్లి



వాడపల్లి వెంకన్న ఆలయంలో భక్తుల రద్దీ

ఆత్రేయపురం: కోనసీమ తిరుపతిగా ఖ్యాతికెక్కిన వాడపల్లి శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామివారి ఆలయం శనివారం గోవింద నామస్మరణతో మార్మోగింది. ఉదయం స్వామివారిని పువ్వులతో ప్రత్యేకంగా అలంకరించారు. రాష్ట్రం నలుమూల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకుని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ ఆవరణలో కొలువైన క్షేత్ర పాలకుడు అన్నపూర్ణా సమేత విశ్వేశ్వరస్వామికి పూజలు చేశారు. ఏడు వారాల నోము ఆచరిస్తున్న భక్తులతో ఆలయ ప్రాంగణంలో కిక్కిరిసింది. ఆలయ కమిటీ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఆలయ ఈఓ భూపతిరాజు కిషోర్ కుమార్ మాట్లాడుతూ స్వామివారికి ప్రత్యేక దర్శనం, అన్న ప్రసాద విరాళం, సేవలు, లడ్డూ విక్రయం, విరాళాలు, ఆన్‌లైన్ ద్వారా రూ.40,32,051 ఆదాయం సమకూరిందన్నారు. ఎస్సై శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీసు సిబ్బంది ట్రాఫిక్‌ను నియంత్రించారు.

అప్పనపల్లికి పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో వాడపల్లి వేంకటేశ్వరస్వామి

మామిడికుదురు: అప్పనపల్లి శ్రీ బాల బాలాజీ స్వామి ఆలయం శనివారం భక్తులతో కోలాహలంగా మారింది. శ్రీదేవి, భూదేవి సమేతంగా కొలువు తీరిన స్వామిని పెద్దసంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. స్వామికి ముడుపులు, మొక్కుబడులు చెల్లించారు. ఆలయం చుట్టూ ప్రదక్షణలు చేశారు, ధ్వజస్తంభం వద్ద దీపాలు వెలిగించి పూజలు నిర్వహించారు. స్వామి వారి సన్నిధిలో ప్రతి నిత్యం నిర్వహించే శ్రీలక్ష్మీనారాయణ హోమంలో భక్తులు పాల్గొన్నారు. స్వామి వారి ఉచిత అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.2.51 లక్షలు ఆదాయం వచ్చింది. టిక్కెట్లు, లడ్డూ ప్రసాదం విక్రయం ద్వారా రూ.1.93 లక్షలు సమకూరింది. నిత్యాన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.57,159 విరాళాలు సమర్పించారు. 3,964 మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారు. 3,012 మంది భక్తులు స్వామివారి అన్న ప్రసాదం స్వీకరించారు. ఆలయ ఈఓ గ్రంధి మాధవి, ధర్మకర్తల మండలి చైర్మన్ చిట్టూరి రామకృష్ణ, ట్రస్టు బోర్డు సభ్యులు చిట్టాల సత్తిబాబు, గూటం శ్రీనివాస్, కొమ్ముల సూరిబాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

కట్టుకున్నవాడే కడతేర్చాడు



సంఘటనా స్థలంలో వివరాలు సేకరిస్తున్న పోలీసులు



లక్ష్మి (ఫైల్)

నల్లజర్ల: ప్రేమించి, పెళ్లి చేసుకున్న భార్యను ఓ వ్యక్తి హత్య చేశాడు. ఆపై ఆమె ఆత్మహత్య చేసుకున్నట్టు నమ్మించబోయి పోలీసులకు దొరికిపోయాడు. సీఐ దుర్గాప్రసాద్ తెలిపిన వివరాల ప్రకారం.. జగన్నాథపురానికి చెందిన గుర్రం వెంకటేశు, కోటమ్మల కుమార్తె లక్ష్మికి అదే గ్రామానికి చెందిన తానెం విష్ణుతో 11 ఏళ్ల క్రితం వివాహమైంది. ఇద్దరూ ప్రేమించుకుని, పెద్దల సమక్షంలో పెళ్లి చేసుకున్నారు. ఈ దంపతులకు ఇద్దరు పిల్లలు. విష్ణు పామాయిల్ గెలల కోత కార్మికుడిగా, లక్ష్మి (28) జీడిగింజల ఫ్యాక్టరీలో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే భార్యతో విష్ణు తరచూ గొడవ పడేవాడు. ఇష్టానుసారం కొట్టేవాడు. శుక్రవారం రాత్రి కూడా భార్యభర్తలు గొడవ పడ్డారు. తెల్లవారిన తర్వాత ఇరుగుపొరుగు వారికి విష్ణు తన భార్య ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని చెప్పాడు. అనుమానం వచ్చిన వారు లక్ష్మి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చారు. వారువచ్చి చూడగా లక్ష్మి ఒంటిపై గాయాలు కనిపించాయి. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించారు. విష్ణును అదుపులోకి తీసుకొని విచారించగా లక్ష్మిని తలపై కొట్టడంతో చనిపోయిందని, తానే కిటికీకి చున్నీ కట్టి ఉరి వేసినట్టు చిత్రీకరించానని ఒప్పుకున్నాడు. కేసు దర్యాప్తులో ఉంది.